
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
సోమవారం 11 మార్చి 2024





రేషన్‌కార్డు ఈకేవైసీ
గడువు పొడిగింపు!

మేడ్చల్ మార్చి 10, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అర్హులకు సంక్షేమ పథకాలు అందించడానికి సర్కారు పకడ్బందీగా చర్యలు చేపట్టింది. ఈ ప్రక్రియలో భాగంగా రేషన్‌కార్డులకు ఈ కేవైసీ తప్పనిసరి చేసింది. అందుబాటులో ఉన్న రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి లబ్ధిదారులు ఈకేవైసీ చేసుకోవాలనిపౌరసరఫరాల అధికారులు సూచించారు. దీంతో స్వగ్రామం, పట్టణాల్లో ఎక్కడి వారు అక్కడ నమోదు చేసుకున్నారు. కానీ జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు, విదేశాలకు బతుకుదెరువు కోసం వలస వెళ్లిన వారి ఈ కేవైసీ ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ఫిబ్రవరి 29తో గడువు ముగిసినప్పటికీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇంకా వేలల్లో లబ్ధిదారులు నమోదు చేసుకోలేదు. దీంతో రేషన్‌కార్డుల ఈ కేవైసీ ప్రక్రియ గడువును ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ప్రస్తుతానికి గడువు తేదీ ప్రకటించలేదు. ప్రభుత్వం ఈకేవైసీ వెబ్‌సైట్‌ను మూసివేయకుండా అందుబాటులో ఉంచింది. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.



కుస్తీమే సవాల్

జీవన్గి జాతరలో తలపడిన పల్లె పహిల్వాన్లు

బషీరాబాద్, మార్చి10: బషీరాబాద్ మండలం జీవన్గి గ్రామంలోని మహాదేవలింగేశ్వరాలయం జాతర ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు ఆలయ సమీపంలో కాగ్నానది ఇసుక దిబ్బలపై ఉత్కంఠ భరితంగా కుస్తీ పోటీలు కొనసాగాయి. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన సుమారు 100మంది మల్లయోధులు కుస్తీ పోటీల్లో తలపడ్డారు. కర్ణాటక ప్రాంతానికి చెందిన శ్రీకాంత్ కాంబ్లే విజేతగా నిలవగా ఆలయ కమిటీ పెద్దలు తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి చేతుల మీదుగా విజేతకు 10తులాల వెండి కడియాన్ని తొడిగారు. ద్వితీయ స్థానంలో నిలిచిన మహేష్‌కు 5 తులాల వెండి కడియాన్ని బహూకరించారు.



ఆది భిక్షువుకి అన్నాభిషేకం

నేడు పూర్ణాహుతితో ముగియనున్న కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు

కీసర, మార్చి10: కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు మాఘబహుళ అమావాస్య ఆదివారం పురస్కరించుకొని స్వామివారికి ఉదయం శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఆనంతరం అందరి ఆకలి తీర్చే హరహరమహదేవుడికి ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఫౌండర్ సభ్యులు వరిఅన్నంతో అన్నాభిషేకం, తైలాభిషేకం నిర్వహించారు. దీంతో పాటు ప్రదోషకాలపూజ, నీరాజనం, మంత్రపుష్పం, వైదిక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యల్లో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. వేడుకల్లో భాగంగా రాత్రి స్వామివారికి వసంతోత్సవం, పుష్పయాగం నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులకు వివిధ రకాలపూలతో అలంకరించి పవళింపు సేవ నిర్వహించారు. కాగా, బ్రహ్మోత్సవాలు నేడు సోమవారంతో ముగియనున్నాయి. ఉదయం 5గంటలకు గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. యాగశాలలో క్షేత్రదిబ్బలి, పూరాహుతితో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.



రామలింగేశ్వరుడికి అన్నాభిషేకం చేసిన ఆలయ నిర్వాహకులు

చేవెళ్ల గడ్డపై ఎగిరేది కాంగ్రెస్ జెండానే!

- జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

వికారాబాద్, మార్చి 10: పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అన్నారు. ఆదివారం యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ ఆధ్వర్యంలో వికారాబాద్‌లో జరిగిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎంలుగా, మంత్రులుగా, ఎంపీలుగా పనిచేసిన చాలా మంది పెద్దనాయకులు యువజన కాంగ్రెస్ నుంచే తమ రాజకీయ జీవితాన్ని ప్రారంభించారన్నారు. యువజన కాంగ్రెస్ నాయకత్వం పార్టీకి వెన్నెముకలా పని చేస్తున్నదని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలో ఉన్న యువ ఓటర్లపై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి అధిష్ఠానం కచ్చితంగా గుర్తిస్తుందన్నారు. పట్నం కుటుంబం యువజన కాంగ్రెస్ నాయకులకు అన్ని విధాలుగా వెన్నుదన్నుగా ఉంటుందని చెప్పారు. మతరాజకీయలు చేసే బీజేపీని ప్రజలు నమ్మడం లేదన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి ఇన్‌చార్జిగా ఉన్నారని, ఈ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించి సీఎంకు కానుకగా ఇద్దామన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి మాట్లాడుతూ, వికారాబాద్ జిల్లా నుంచి భారీ మెజార్టీ ఇచ్చేలా అందరూ సమన్వయంతో పని చేయాలని కోరారు. యువజన కాంగ్రెస్ జిల్లాఅధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.





సొంత ఇల్లు లేని నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్లపైన గంపెడాశలు పెట్టుకున్నారు. గూడు లేని నిరుపేదల సొంత ఇంటి కలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని నేడు ప్రారంభించనుంది. ముందుగా సొంత స్థలం ఉన్న పేదలకు అదే స్థలంలో కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టేందుకు నాలుగు విడతల్లో రూ. 5 లక్షలు అందజేయనుంది.

ఇందిరమ్మ ఇళ్లపై గంపెడాశలు!

- నేడు ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభానికి శ్రీకారం
- సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం
- తొలి విడతలో ఖాళీ స్థలం ఉన్న నిరుపేదలకు మాత్రమే
- ఒక్కో నియోజకవర్గానికి 3,500 గృహాలు మంజూరు
- జిల్లాకు 11,750 యూనిట్లు కేటాయించే అవకాశం

వికారాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సొంత ఇల్లు లేని నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్లపైన గంపెడాశ పెట్టుకున్నారు. సొంతంగా ఇంటి స్థలాలు ఉన్న పేదలు పక్కా గృహాలు నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం అందించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు గృహలక్ష్మి పథకం ప్రారంభించింది. గత ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద జిల్లాకు 10,280. యూనిట్లు మంజూరు చేయగా, .57,571 మంది పేదలు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసిన తరువాత ఇళ్ల మంజూరు కోసం ఎదురు చూస్తున్న క్రమంలోనే ఎన్నికల షెడ్యూల్ వెలువడడం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం జరిగిపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత కేసీఆర్ ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేసి దాని స్థానంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమల్లోకి తీసుకు రావాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. గృహలక్ష్మి పథకం కోసం గత ఏడాది ఆగస్టు నెలలో జిల్లాలో 57,571 మంది దరఖాస్తు చేసుకోగా, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయంతో ఆ విన్నపాలన్నీ బుట్టదాఖలయ్యాయి. గృహలక్ష్మి పథకం రద్దు కావడంతో సొంత ఇంటి నిర్మాణం కోరుకునే వారు మళ్లీ ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం దరఖాస్తు చేసుకోక తప్పడం లేదు. ప్రజా పాలనలో భాగంగా జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు, 20 మండలాల పరిధిలో గ్రామ సభల్లో ప్రజలు అభయహస్తం కింద ఆధార్, రేషన్ కార్డు జత పరిచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి 2,64,242 మంది దరఖాస్తు చేసుకున్నారు. గత ప్రభుత్వం గృహలక్ష్మి పథకం అమలు సందర్భంగా జిల్లాల వారీగా యూనిట్లు ప్రకటించగా, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం యూనిట్లతో సంబంధం లేకుండా ఇల్లు లేని పేదలు ఎంత మంది ఉన్నా దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో పేదలంతా పోటీ పడి దరఖాస్తు చేసుకున్నారు.

నిరుపేదల సొంతింటి కల సాకారం దిశగా అడుగులు

ఈ ఏడాది 11,750 గృహాలు మంజూరు?

ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని దశల వారీగా అమలు చేయనున్నారు. మొదటి విడతలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 3,500 గృహాలు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల పరిధిలోని మండలాలన్నీ వికారాబాద్ జిల్లా పరిధిలోనే ఉండగా, కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాలు జిల్లా పరిధిలోకి వస్తాయి. మిగతా నాలుగు మండలాలు నారాయణపేట్ జిల్లా పరిధిలో ఉన్నాయి. అదే పరిగి నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాలు జిల్లా పరిధిలోకి వస్తుండగా, మిగతా రెండు మండలాలు మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోకి వస్తాయి. చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోకి వచ్చే నవాబ్‌పేట మండలం వికారాబాద్ జిల్లాలోనే కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతలో నియోజక వర్గానికి 3,500 వంతున ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా 11,750 ఇందిరమ్మ గృహాలు మంజూరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునే వారికి ఉపయోగ పడే విధంగా వివిధ రకాల మోడళ్లలో ఇంటి నమూనాలను సిద్ధం చేయనున్నారు. లబ్ధిదారులు తమకు ఉపయోగ పడే విధంగా ఇంటి నిర్మాణం చేపట్టినా.. ఆ ఇంట్లో వంట గది, టాయిలెట్ తప్పనిసరిగా ఉండాలనే నిబంధన విధించనున్నారు.

నాలుగు విడతల్లో చెల్లింపు...

ఇందిరమ్మ ఇళ్లకు చెల్లించే రూ.5 లక్షలను నాలుగు విడతల్లో నిర్మాణ దశల ఆధారంగా చెల్లించనున్నారు. నిర్మాణ దశను అధికారులు ధృవీకరించిన తరువాతనే సంబంధిత లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలోకి ఇందిరమ్మ ఇంటి డబ్బులు జమ చేయనున్నారు.. బేస్‌మేట్ స్థాయిలో రూ. లక్ష, పైకప్పు (స్లాబ్) స్థాయిలో రూ. లక్ష, పైకప్పు నిర్మాణం పూర్తయిన తరువాత రూ. 2లక్షలు, నిర్మాణం పూర్తయిన తరువాత రూ. లక్ష చెల్లించనున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి రేషన్/ఆహార భద్రత కార్డు ఉన్న వారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నారు. లబ్ధిదారుడికి సొంత స్థలం ఉండాలి. లేదా ప్రభుత్వం కేటాయించినదైనా ఉండాలి. గుడిసె ఉన్నా.. గడ్డితో పైకప్పు వేసుకున్నా.. మట్టి గోడలతో నిర్మించిన తాత్కాలిక ఇల్లు ఉన్నా ఇందిరమ్మ ఇంటి పొందడానికి అర్హులుగా పరిగణించనున్నారు. అద్దె ఇంట్లో ఉంటున్నా.. వివాహమైనా.. ఉమ్మడి కుటుంబంలో ఉంటున్నా.. లబ్ధిదారులుగా ఎంపిక చేస్తారు.. ఒంటరి, వితంతు మహిళలను కూడా ఈ పథకంలో అర్హులుగా గుర్తించనున్నారు.

తొలి విడతలో ఖాళీ స్థలం ఉన్నవారికే..

పేదల సొంతింటి కల సాకారం చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని మొదట సొంత స్థలం ఉన్న పేదలకే వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ ఇంటి కోసం వచ్చిన దరఖాస్తుల్లో అర్హులు ఎంత మంది ఉన్నారనేది గుర్తించనున్నారు. మార్గదర్శకాలు విడుదలైన తరువాత మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా క్షేత్ర స్థాయిల్లో సభలు నిర్వహించనున్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావాలంటే తప్పనిసరిగా నిరుపేదలై ఉండాలి. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి రేషన్/ఆహార భద్రత కార్డు ఉన్న వారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలుస్తోంది. పక్కా ఇల్లు ఉన్న వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యే అవకాశం లేదు. సొంత స్థలం ఉంటే ఆ స్థలం సొంతమేనా లేక ఏ విధంగా సంక్రమించిందనే వివరాలు సేకరించనున్నారు. గ్రామ, వార్డుల్లో సభల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం ప్రత్యేకంగా రూపొందించిన క్షేత్రస్థాయి పరిశీలనా పత్రంలో వివరాలన్నీ నమోదు చేయనున్నారు. ఇదిలా ఉంటే, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇంతకు ముందు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసిందా? అనే సమాచారం సేకరించనున్నారు. ఇంతకు ముందు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసిన వారికి మళ్లీ కొత్తగా ఇళ్లు మంజూరవకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. కాగా, మొదటి దశలో సొంత ఖాళీ స్థలం ఉన్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనుండగా, రెండో దశలో స్థలం లేని పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

నాలాలు మాయం!

హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారి పక్కన యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

- నాలాలు, కల్వర్టులు ఆక్రమించి కట్టడాలు
- వానాకాలంలో చెరువులా మారుతున్న జాతీయ రహదారి
- భారీగా వరద ప్రవాహం.. పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు

ఘట్‌కేసర్, మార్చి 10 : నాలాను ఆక్రమించి, కల్వర్టుకు అడ్డంగా యథేచ్ఛగా భారీ భవంతులు వెలుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇదెక్కడో మారుమూల గ్రామంలో అనుకుంటే పొరపాటే నగరానికి కూతవేటు దూరంలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండల పరిధిలోని చౌదరిగూడ పంచాయతీ, జోడిమెట్ల వద్ద, హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారికి అనుకొని ఎలాంటి అనుమతులు లేకుండానే భారీ నిర్మాణాలు చేపట్టారు. నాలాలను, కల్వర్టులను ఆక్రమించడంతో గతంలో కురిసిన భారీ వర్షాలకు జాతీయ రహదారి చెరువుగా మారి రాకపోకలు నిలిచిపోయాయి. రోజుల తరబడి జోడిమెట్ల, నారపల్లి వద్ద రోడ్డుపై వరదనీరు ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురైన సందర్భాలున్నాయి. రాష్ట్ర రాజధాని నుంచి వరంగల్‌కు వెళ్లడానికి, అక్కడి నుంచి తిరిగి రాజధానికి రావడానికి ముఖ్యమైన రూట్ హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారి. పలు మార్లు పలువురు వీఐపీలు వరదల్లో చిక్కుకుని ఇబ్బందులకు గురయ్యారు. దీంతో జాతీయ రహదారుల శాఖ అధికారులు స్పందించి జోడిమెట్ల, నారపల్లి వద్ద జాతీయ రహదారి ఎత్తును దాదాపు 10 అడుగుల వరకు పెంచారు. దీంతో సమస్యలు తీరాయని వాహనదారులు సంబురపడ్డారు. కానీ ఆసంబురం ఎంతో కాలం నిలువలేదు. కల్వర్టుకు అడ్డంగా భారీ భవనం నిర్మించడంతో వరద నీరు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది.



భారీ వర్షంతో జోడిమెట్ల వద్ద జాతీయ రహదారిపై వరద(ఫైల్)

ప్లాట్ల ఎత్తును పెంచే పనిలో యజమానులు

జాతీయ రహదారి ఎత్తును పెంచడంతో రోడ్డుకు ఇరువైపుల గల ప్లాట్ల యజమానులు తమ తమ ప్లాట్లల్లో మట్టిని పోస్తూ ఎత్తును పెంచుతున్నారు. దీంతో కల్వర్టులు కనుమరుగవుతున్నాయి. లక్షలు వెచ్చించి రోడ్డు ఎత్తు పెంచి అభివృద్ధి చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గతంలో ఇరిగేషన్ అధికారులు సర్వేలు నిర్వహించి నాలాలను మార్కు చేశారు. కానీ జాతీయ రహదారికి అనుకొని ఉన్న ప్లాట్లకు డిమాండ్ పెరగడంతో స్థల యజమానులు రాజకీయ పలుకుబడితో నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇదే అదనుగా స్థల యజమానులు యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారి వరదలకు కొట్టుకుపోయే ప్రమాదముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా జాతీయ రహదారుల శాఖ, ఇరిగేషన్, గ్రామ పంచాయతీల అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జోడిమెట్ల వద్ద కల్వర్టుకు అడ్డంగా నిర్మాణం చేపట్టిన నాయకుడు గతంలో బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేశాడు. మాజీ మంత్రి అండదండలతో నాలుగు అంతస్తుల నిర్మాణం చేపట్టాడు. ఇంతలో ప్రభుత్వం మారి అధికార పార్టీ నాయకులు విమర్శలు చేస్తుండటంతో నిర్మాణదారుడు అధికార పార్టీలో చేరాడు ఇంకేముంది. నియోజకవర్గ మాజీ ప్రజాప్రతినిధి అండదండలు దండిగా ఉండటంతో ఆయా శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూడటానికి సైతం సాహసించడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అయా శాఖల అధికారులు స్పందించి హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారికి ఇరువైపుల నాలాలను, కల్వర్టులను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కల్వర్టులకు అడ్డంగా కట్టిన నిర్మాణాలను తొలగించి వానాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పలువురు పర్యావరణ వేత్తలు డిమాండ్ చేస్తున్నారు.



నాలాను ఆక్రమించి చేపట్టిన నిర్మాణం



కల్వర్టుకు అడ్డంగా కట్టిన గోడ

నిర్మాణదారునికి నోటీసులు జారీ చేశాం



జోడిమెట్ల వద్ద కల్వర్టును ఆక్రమించి నిర్మిస్తున్న కట్టడానికి గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతి లేదు. నిర్మాణదారునికి నోటీసులు జారీ చేశాం. నాలాను ఆక్రమించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులకు నాలాలను గుర్తించాలని లేఖ ద్వారా కోరినాం. నివేదిక రాగానే చర్యలు తీసుకుంటాం.

- శశికుమార్, కార్యదర్శి, చౌదరిగూడ పంచాయతీ

ఎన్‌వోసీ లేకుండానే నిర్మాణం



జోడిమెట్ల వద్ద నాలా, బఫర్‌ను ఆక్రమించి ఇరిగేషన్ శాఖ నుంచి ఎన్‌ఓసీ పొందకుండానే నిర్మాణం చేపట్టాడు. నాలాలను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. కల్వర్టులకు అడ్డంగా కట్టడాలు చేసే ఇబ్బందులు తలెత్తుతాయి. నాలాలు, బఫర్‌ల వద్ద ఇరిగేషన్ నుంచి ఎన్‌ఓసీ తీసుకున్న తర్వాతే నిర్మాణాలు చేపట్టాలి.

- పరమేష్, ఏఈ ఇరిగేషన్, ఘట్‌కేసర్ మండలం



నేడు మండల సర్వసభ్య సమావేశం

ధారూరు, మార్చి 10: మండల సర్వసభ్య సమావేశం సోమవారం(నేడు) నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు మండల పరిషత్తు కార్యాలయం సమావేశ మందిరంలో సమావేశం ప్రారంభమవుతుందని ఆమె చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆమె కోరారు.







స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలి



కొడంగల్‌లో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి

కొడంగల్, మార్చి 10: ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం కొడంగల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి గాంధీనగర్ వరకు డీఎస్పీ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే ఫ్లాగ్‌మార్చ్ ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై భరత్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి బ్రహ్మకుమారీస్ సన్మానం



మునిసిపల్ పారిశుధ్య విభాగం ఉద్యోగులను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ మంజుల రమేష్

వికారాబాద్, మార్చి 10: బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శ్రీరామమందిరం వద్ద ఏర్పాటు చేసిన మహాశివరాత్రి ఉత్సవాల వేడుకల్లో ఆదివారం పారిశుధ్య సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వికారాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో భాగంగా ఉదయం 4గంటలకే పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయన్నారు. పారిశుధ్య సిబ్బంది సేవలను గుర్తించి సన్మానించిన మధు అక్కయ్యకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ ఏసు, జవాన్లు వినోద్, చిన్నయ్య, రాజు, ఆశయ్య, శంకర్, బ్రహ్మకుమారీస్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆహ్వానం



ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే కాలే యాదయ్య

నవాబుపేట, మార్చి 10: చించల్‌పేట్‌లో సోమవారం నుంచి ఈనెల 14వరకు నిర్వహించే ఊరడమ్మ గ్రామ దేవత నాభిశీల, బొడ్రాయి యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పలువురికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, పరిగి మాజీ ఎమ్మెల్యే కే.మహేశ్‌రెడ్డిలకు ఆదివారం ఆహ్వాన పత్రికలు అందించాలని, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి రావాలని కోరారు.

మహేష్ శాస్త్రికి జ్యోతిష్య శిరోమణి అవార్డు




మహేష్‌కుమార్ శాస్త్రిని సన్మానిస్తున్న నిర్వాహకులు

వికారాబాద్, మార్చి 10: ప్రముఖ పురోహితుడు కొడంగల్ మండలం ఎన్కేపల్లి గ్రామానికి చెందిన జంగం మహేష్ శాస్త్రి జ్యోతిష్య శిరోమణి అవార్డు అందుకున్నారు. కొడంగల్, తాండూరు, పరిగి, వికారాబాద్, కోస్గి ప్రాంతాల్లో పురోహితం, జ్యోతిష్యంలో మంచి గుర్తింపు పొందిన మహేష్ శాస్త్రిని ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో సంస్థ జ్యోతిష్య శిరోమణి అవార్డుతో సత్కరించింది. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళాభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో సంస్థ ఫౌండర్ డాక్టర్ సి.నరసింహస్వామి మహేష్‌శాస్త్రికి జ్యోతిష్య శిరోమణి అవార్డు, ప్రశంసాపత్రం అందజేశారు. జ్యోతిష్య శిరోమణి అవార్డు అందజేసిన ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో సంస్థ వ్యవస్థాపకులు, గురువులకు మహేష్ శాస్త్రి ధన్యవాదాలు తెలిపారు.









శ్రీనివాస్‌కు నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

యాచారం, మార్చి 10 : త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం ప్రతీ కార్యకర్త అంకిత భావంతో పని చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ యాచారం మండల ప్రధాన కార్యదర్శిగా మాల్‌కు చెందిన బట్టు శ్రీనివాస్‌ను నియమిస్తూ ఆదివారం ఎమ్మెల్యే నగరంలోని ఆయన నివాసంలో నియామకపత్రం అందజేసి మాట్లాడారు. శాసనసభ ఎన్నికలప్పుడు పార్టీ విజయం కోసం పనిచేసినట్లుగా.. ఎంపీ ఎన్నికల్లో కూడా అదే ఉత్సాహంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఆరు గ్యారంటీలను ప్రతీ ఇంటికి అందేలా నాయకులు, కార్యకర్తలు చొరవ తీసుకోవాలన్నారు. ఉచిత బస్సు ప్రయాణంపై విపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రకటనలను తిప్పికొట్టాలని మల్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మస్కు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అవకాశమిస్తే పాలమూరు గొంతుకనవుతా

● మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

షాద్‌నగర్, మార్చి 10 : ప్రజలు ఎన్నికల్లో గెలిపించి ఎంపీగా అవకాశమిస్తే పాలమూరు గొంతుకనవుతానని మహబూబ్‌నగర్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. తనకు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసే అవకాశాన్ని కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధిష్ఠానానికి రుణపడి ఉంటానని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తనను గెలిపిస్తే నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేల ఆశీస్సులు తనకు ఉన్నాయని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఎలా గెలిపించారో.. తనను కూడా పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. తాను గెలిస్తే పార్లమెంట్‌లో పాలమూరు ప్రజల గొంతును వినిపిస్తానన్నారు. ముఖ్యమంత్రి ముద్దుబిడ్డ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆశీస్సులు కూడా తనకు కావాలన్నారు.

భారీ మెజార్టీతో గెలిపిస్తాం - ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి వంశీచంద్‌ను భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఇందుకోసమే లౌకిక శక్తుల పునరేకీకరణ కోసం సర్వం ఒడ్డుతామన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం కుటుంబాలకు కూడా సమయం ఇవ్వకుండా తాను, వంశీ నిరంతరం ప్రజల మధ్యనే ఉంటున్నామన్నారు. గతంలో పాలమూరు నుంచి గెలుపొందిన ఎంపీలు పార్లమెంట్‌లో ప్రజల సమస్యల గురించి గొంతెత్తలేదని, వంశీచంద్ మాత్రం పార్లమెంట్‌లో పాలమూరు ప్రజాగొంతుకను వినిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించడానికి క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని వీర్లపల్లి శంకర్ కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, బాబర్‌ఖాన్, రఘు, చెన్నయ్య, తిరుపతిరెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జంగా నరసింహ, రాజు, వీరేశం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ : మీడియాతో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

అనంత పద్మనాభుడి ఆశీస్సులతో విజయం సాధిస్తా

కొత్తూర్/కేశంపేట : పెంజర్ల శ్రీఅనంతపద్మనాభస్వామి ఆశీస్సులతో పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తానని వంశీచంద్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పెంజర్ల అనంతపద్మనాభస్వామి ఆలయంలో ఆదివారం వంశీచంద్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ అనంతపద్మనాభస్వామిని దర్శించుకుంటే అంతా మంచే జరుగుతుందన్నారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ బెజవాడ అనితారెడ్డి వంశీని శాలువాతో సన్మానించారు. మాజీ జడ్పీటీసీ శ్యాసుందర్‌రెడ్డి, ఎంపీటీసీ అంజమ్మ, మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు అంబటి ప్రభాకర్, రవికుమార్‌గుప్త, సిద్ధార్థరెడ్డి, వస్పుల మహేందర్, దయానంద్‌గుప్త, నవీన్‌చారి, ఎర్రొళ్ల జగన్, లింగారం సురేష్‌గౌడ్, పాముల రమేష్, రాందాస్‌నాయక్, రమేష్, సుధాకర్, చింతసాయితేజశ్వర్, రాజు, తదితరులున్నారు. అదేవిధంగా కేశంపేట మండలం బైర్కాన్‌పల్లిలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా పోస్టర్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాయలంలో వీర్లపల్లి శంకర్, వంశీచంద్‌రెడ్డిలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రూప్లానాయక్, యాదగిరిచారి, వై.గిరిధర్, అంజయ్య, రాఘవేందర్‌రావు, కుమార్, గణేష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వంశీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు : ఏఐసీసీ కార్యదర్శి, కల్వకుర్తి మాజీ ఎమ్మె ల్యే చల్లా చల్లా వంశీచంద్‌రెడ్డిని ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతిశ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో ఆయా మండలాల నాయకులు వంశీచంద్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లను షాద్‌నగర్‌లో కలిశారు. మహబూబ్ నగర్ కాంగ్రెస్ అభ్యర్థిత్వం ఖరారైన నేపథ్యంలో శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు అజీం, రవీందర్, బాల్‌రాజ్, రామలక్ష్మణ్, హీరా సింగ్, జవహర్‌లాల్, మల్లేశ్‌గౌడ్, రాంచందర్‌నాయక్ తదితరులు వంశీని కలిశారు.

బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు
హరీష్‌రెడ్డి రాజీనామా



మేడ్చల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలో బీజేపీకి గట్టి షాక్ తగిలింది. భారతీయ జనతా పార్టీ మేడ్చల్-మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి ఆదివారం సాయంత్రం పదవికి, పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పంపించారు. పార్టీలో గత 30 సంవత్సరాలుగా తనకు సహకరించిన ప్రతిఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమయం వచ్చినప్పుడు రాజీనామా గురించి తప్పకుండా చెబుతానని హరీష్‌రెడ్డి తెలిపారు. కాగా, జిల్లా అర్బన్ అధ్యక్షుడు రాజీనామా చేయడంతో చర్చనీయంశంగా మారింది.

పార్కు స్థలాన్ని కాపాడాలి

● సాయిశ్రీ నిలయం కాలనీవాసుల నిరసన ● రియల్టర్.. సొసైటీ భూమిని ఇతరులకు విక్రయించాడని ఆందోళన



పార్కు స్థలంలో ప్రహరీ నిర్మించిన రియల్టర్

మేడ్చల్ టౌన్, మార్చి 10 : మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని చెక్ పోస్టు వద్ద గల సాయి శ్రీ నిలయం వెల్ఫేర్ సొసైటీకి చెందిన దాదాపు రూ.7 కోట్ల రూపాయల విలువచేసే పార్కు స్థలాన్ని కొందరు రాత్రికి రాత్రి కబ్జాచేసి ప్రహరీ నిర్మించటంతో ఆదివారం కాలనీ వాసులు నిరసనకు దిగారు. కాలనీ లేఅవుట్‌లో చూపించిన 1970 చదరపు గజాల స్థలాన్ని ఆరు ప్లాట్లుగా మార్చి భూ భకాసురులు దొంగచాటుగా ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేశారని కాలనీవాసులు ఆరోపించారు. ఈ విషయమై అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పట్టణంలోని సర్వే నెంబర్ 873, 882లో గల 13 ఎకరాల 12 గుంటల స్థలంలో సాయి శ్రీ పేరుతో 256 ప్లాట్లతో లేఅవుట్‌ను తయారు చేశారు. కాగా, మొత్తం లేఅవుట్‌కు గాను 1970 చదరపు గజాల స్థలాన్ని ప్రత్యేకంగా పార్కుకోసం వదలటంతో పాటు సదరు రియల్‌ఎస్టేట్ వ్యాపారి పిల్లలు ఆడుకోవటానికి ఆట పరికరాలు, పెద్దలు కూర్చోవడానికి కుర్చీలు, పార్కు పరిసరాల్లో మొక్కలు ఏర్పాటు చేశారు. లేఅవుట్‌లోని ప్లాట్ల విక్రయాలు పూర్తయిన వెంటనే రియల్‌ఎస్టేట్ వ్యాపారస్తులు పార్కు స్థలాన్ని ఆరుప్లాట్లుగా మార్చి మరో లేఅవుట్‌ను తయారుచేసి కాలనీ వాసులకు తెలియకుండా ఇతరులకు అమ్ముకున్నారు. విషయం తెలుసుకున్న కాలనీవాసులు రియల్‌ఎస్టేట్ వ్యాపారి తీరును తప్పుపడుతూ పార్కు స్థలం కోసం కేటాయించిన స్థలంలో పార్కును ఏర్పాటుచేయాలని కోరుతూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

స్థలంపై కన్నేసిన రియల్టర్

భూముల ధరలు పెరగటంతో లేఅవుట్ తయారు చేసిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి పార్కుస్థలాన్ని ప్లాట్లుగా మార్చి అమ్మేశాడని కాలనీవాసులు ఆరోస్తున్నారు. గ్రామ పంచాయతీ లేఅవుట్ కావటంతో పాత సర్పంచ్‌తో ప్లాన్‌ను మార్చి సదరు రియల్‌ఎస్టేట్ వ్యాపారస్తులు అమ్ముకున్నారని ఆరోపిస్తున్నారు. కాగా, కాలనీవాసుల కళ్లుగప్పి రాత్రికి రాత్రి పార్కు స్థలంలో ప్రహరీ నిర్మించి కబ్జాకు పాల్పడినట్లు తెలిపారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారికి అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండటంతో అధికారులు కూడా పట్టించుకోవటం లేదని సొసైటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, న్యాయం జరగకుంటే పార్కు స్థలం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు.



ప్లకార్డులతో నిరసనకు దిగిన కాలనీవాసులు

'పార్కు స్థలాన్ని కబ్జా చేయలేదు'

పార్కు స్థలాన్ని కబ్జా చేయలేదని సదరు సాయి శ్రీ రియల్‌ఎస్టేట్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. లేఅవుట్ ప్రకారం పార్కుకోసం వదిలిన 1570 గజాల స్థలాన్ని సర్వేచేసి కాలనీ సొసైటీకి అప్పగిస్తామని తెలిపారు. అయితే, పార్కు స్థలాన్ని ప్లాట్లుగా మార్చి ఇతరులకు అమ్మామని సొసైటీ సభ్యులు చేస్తున్న ఆరోపణలను సదరు రియల్‌ఎస్టేట్ ప్రతినిధులు తోసిపుచ్చుతున్నారు.

- ఎమ్మెల్యే సూచించినా.. కౌన్సిల్ ఆమోదం తెలిపినా.. ఇప్పటికీ ప్రారంభం కాని ప్రక్రియ
- అధికారుల నిర్లక్ష్యంతో ఆగిన అభివృద్ధి పనులు
- టెండర్ ప్రక్రియ చేపట్టని ఇంజనీరింగ్ విభాగం
- నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి!

వార్డుకు రూ.10 లక్షలు ఏమయ్యాయ్!

తాండూరు, మార్చి 10 : కౌన్సిలర్లు అందరూ నాలుగేళ్ల తర్వాత తీపికబురు వచ్చిందని సంబరపడ్డారు. వార్డుల్లో చిన్న చిన్న సమస్యలైనా తీరుతాయని.. ప్రజల్లోకి దర్జాగా వెళ్లేందుకు అవకాశముటుందని భావించారు. దాంతో కౌన్సిలర్లు వార్డుకు రూ.10 లక్షల చొప్పున ఏకగ్రీవంగా ఆమోద ముద్రవేశారు. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా నిధుల విడుదలకు మోక్షం కలగలేదు. కమిషనర్, ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యమే వార్డుకు రూ. 10 లక్షలు పెండింగ్‌లో పడ్డాయనే ఆరోపణలున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. ఫిబ్రవరి 19న మున్సిపల్ సాధారణ అంచనా బడ్జెట్ (2024-25) సమావేశం ఛైర్‌పర్సన్ స్వప్న పరిమళ అధ్యక్షతన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొనగా జరిగింది. సమావేశానంతరం ఎమ్మెల్యే సూచన మేరకు పార్టీలకతీతంగా తాండూరు పట్టణంలోని 36 వార్డులకు.. ఒక్కో వార్డుకు రూ.10లక్షల చొప్పున 14వ, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి పనులు చేయించాలని కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ పనులను ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఆయా పార్టీల ఫ్లోర్‌లీడర్లు అధికారులు కలిసి వార్డులవారీగా పనులకు సంబంధించి కౌన్సిలర్ల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకొని పనులు చేయించాలని ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్, కమిషనర్‌ను ఆదేశించారు. అత్యవసర పనుల కింద వెంటనే ప్రక్రియను చేపట్టాలని కౌన్సిలర్లు ఇన్‌చార్జి డీఈఈకి సూచించారు. ఇంతవరకు బాగానే ఉన్నా అధికారులు చేపట్టాల్సిన ప్రక్రియను సకాలంలో పూర్తి చేయలేకపోయారు. ఏవేవో కారణాలు చెబుతూ అధికారులు దాట వేస్తున్నారని పలువురు కౌన్సిలర్లు వాపోతున్నారు. ఎమ్మెల్యే చెప్పినా కౌన్సిలర్లు ఆమోదించినప్పటికీ కమిషనర్, ఇంజనీర్ అధికారుల నిర్లక్ష్యంతో రూ. 10 లక్షలు కేటాయింపు అర్థంతరంగా నిలిచిపోయాయి. అధికారులకు కౌన్సిల్ సమావేశం తర్వాత 14 రోజుల గడువు ఉన్నప్పటికీ సకాలంలో ప్రక్రియను చేపట్టకపోవడం తాము అనుకున్న పనులకు ప్రాధాన్యతనిస్తూ ఈ పనులకు పక్కకుపెట్టడంతో కౌన్సిలర్లు అందివచ్చిన అవకాశాన్ని అధికారుల నిర్లక్ష్యంతో మరో రెండు నెలలు ఆగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా, మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ రావడంతో టెండర్ ప్రక్రియ ను చేపట్టలేదని మాటిచ్చి తప్పారని ఇంజనీరింగ్ అధికారుల తీరు పట్ల కౌన్సిలర్లు మండి పడుతున్నారు.



తాండూరు మున్సిపల్ కార్యాలయం

మానవత్వం చాటుకున్న
మంత్రి జూపల్లి

● మూర్ఛతో రోడ్డుపై పడిపోయిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించిన మంత్రి

షాద్‌నగర్ రూరల్, మార్చి 10 : ఆపదలో ఉన్న వ్యక్తిని కాపాడి మంత్రి జూపల్లి కృష్ణారావు మానవత్వం చాటుకున్నారు. మూర్ఛతో సొమ్మసిల్లి రోడ్డుపై పడిపోయిన ఓ వ్యక్తిని ఆయన ఆస్పత్రికి తరలించారు. ఆదివారం ఉదయం జూపల్లి కృష్ణారావు హైదరాబాద్ నుంచి కొల్లాపూర్ వెళ్తుండగా ఫరూక్‌నగర్ మండలం రాయికల్ టోల్ గేట్ సమీపంలో రోడ్డుపక్కన గుర్తుతెలియని వ్యక్తి పడిపోయి ఉన్నాడు. గమనించిన జూపల్లి తన కాన్వాయ్‌ను ఆపి ఆ వ్యక్తి దగ్గరకు వెళ్లారు. మూర్ఛతో పడిపోయిన అతడికి మంత్రి అనుచరులు సపర్యలు చేయగా మంత్రి అంబులెన్స్‌కు ఫోన్ చేసి అతడిని ఆస్పత్రికి తరలించారు. మూర్ఛ బాధితుడి పట్ల మంత్రి జూపల్లి తీసుకున్న చొరవకు పలువురు అభినందనలు తెలుపుతున్నారు.



అంబులెన్స్‌కు ఫోన్ చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

● ఆదివారం అమావాస్య కావడంతో ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తుల రాక

కిటకిటలాడిన భూకైలాస్

తాండూరు రూరల్, మార్చి 10 : తాండూరు మండల పరిధిలోని అంతారం భూకైలాస్ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం అమావాస్య కావడంతో తాండూరులోతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, హైదరాబాద్, వికారాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. నీటి గుండం ద్వారా భక్తులు ద్వాదశజ్యోతిర్లింగాలు, మహాశుడు, ఆలయ ప్రాంగణంలోని దేవతామూర్తులను దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో అలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. ఆలయ వ్యవస్థాపకులు వాసుపవార్ భక్తులకు అన్నదానం నిర్వహించారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణ, సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ కాశీనాథ్ సిబ్బంది అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. వాసుపవార్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

జ్యోతిర్లింగాలను దర్శించుకున్న ఏఎస్పీ

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భూకైలాస్ ద్వాదశ జ్యోతిర్లంగాలను వికారాబాద్ జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి కుటుంబికులతో కలిసి దర్శించుకున్నారు. భూకైలాస్‌లోని ద్వాదశ జ్యోతిర్లింగాలతోపాటు ఇతర దేవతామూర్తులను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వాసుపవార్ ఏఎస్పీని, కుటుంబ సభ్యులను సన్మానించారు. ఏఎస్పీ మాట్లాడుతూ ఆలయం అద్భుతంగా ఉందని, దేవతలందరినీ ఒకేచోట దర్శించుకునేందుకు వీలుగా ఉందని తెలిపారు. అదేవిధంగా ఆలయంలో భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.





శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు; జ్యోతిర్లింగాల దర్శనం చేసుకున్న అనంతరం ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

షాబాద్ : మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం సాయిరెడ్డిగూడలో ఆదివారం బండలాగుడు పోటీలు అట్టహాసంగా జరిగాయి. మహాశివరాత్రిని పురస్కరించుకొని రెండు రోజులుగా మల్లన్న స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. బండలాగుడు పోటీల్లో ప్రథమ బహుమతి సూర్యాపేటకు చెందిన నుంకి సురేందర్ రెడ్డి గెలుపొందగా రూ.70వేలు షీల్డు అందజేశారు. ద్వితీయ బహుమతి కర్నూలుకు చెందిన కురువ కర్రెప్ప గెలుపొందగా రూ.60వేల నగదు షీల్డు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో లవకుశ వీధినాటకం ప్రదర్శించారు. నాయకులు మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, లింగం, సతీష్‌చారి, భాస్కర్‌చారి, రాజుగౌడ్, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు. కాగా, సాయిరెడ్డిగూడలో మల్లన్న స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అనంతరం బండలాగుడు పోటీలకు హాజరయ్యారు.



షాబాద్ : పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు వెంకట్‌రెడ్డి, తదితరులు

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

షాబాద్, మార్చి 10 : లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైతాబాద్, నాందార్‌ఖాన్‌పేట్, లింగారెడ్డిగూడ, సాయిరెడ్డిగూడ, పెదవేడు గ్రామాలకు చెందిన యువకులు నాందార్‌ఖాన్‌పేట్‌లో విశ్వేశ్వర్‌రెడ్డి పెద్దఎత్తున బీజేపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆధ్వర్యంలో భారత్ అభివృద్ధి చెందిన దేశాల్లో చేరిందని, నేడు ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తుందని అన్నారు. ఈసారి ఎన్నికల్లో సర్వేలన్నీ మోదీ సర్కారు గెలుపునే సూచిస్తున్నాయని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీయే 400 స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కాగా, అంతకు ముందు లింగారెడ్డిగూడ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం సాయిరెడ్డిగూడలో శివరాత్రిని పురస్కరించుకొని బండలాగుడు పోటీలు నిర్వహించగా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ మండలాధ్యక్షుడు కిరణ్, నాయకులు రాము, మహేందర్, కృష్ణాచారి, రాజీవ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, రవిగౌడ్, జనార్దన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణ, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కండువాలు కప్పి యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి





కోట్‌పల్లి ప్రాజెక్టులో సందర్శకుల ఎంజాయ్

వికారాబాద్ జిల్లా ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు పరిసరాలు ఆదివారం సందర్శకులతో సందడిగా కనిపించాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు ప్రాజెక్టు ఒడ్డుపై, నీటిలో సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ సరదాగా గడిపారు. మరికొందరు ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తూ ఎంజాయ్ చేశారు. - ధారూరు, మార్చి 10

ఆలయాలకు భక్తుల తాకిడి


మేడ్చల్ టౌన్:మల్లన్న జాతరలో బోనాలతో స్థానికులు


కులకచర్ల: పాంబండ దేవాలయం దగ్గర భక్తులు

మేడ్చల్ టౌన్, మార్చి 10: మహాశివరాత్రి ముగింపు ఉత్సవాల నేపథ్యంలో ఆలయాల్లో భక్తుల తాకిడి కనిపించింది. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం మల్లన్న జాతర ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా మల్లన్న కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకుని బోనం సమర్పించుకున్నారు. స్థానిక మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, స్థానిక నాయకులు మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, బేరీ బాల్‌రాజ్ స్వామివారిని దర్శించుకున్నారు.

కులకచర్ల: బండవెల్కిచర్ల గ్రామ పాంబండ ఆలయానికి భక్తుల తాకిడి నెలకొంది. ఆదివారం అమావాస్య కావడంతో ఉదయం నుంచే భక్తులు పెద్దఎత్తున పాంబండకు తరలి వచ్చారు. కోనేరులో స్నానాలు చేసి శ్రీరామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. అదేవిధంగా చౌడాపూర్ మండలంలోని మందిపాల్ గ్రామంలో శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకీ సేవ తదితర కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, సొసైటీ ఛైర్మన్ మొగులయ్య, బ్లాక్ బీ అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు బుచ్చయ్య పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

నవాబుపేట: మండలంలోని నారేగూడలో శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ పర్వేద మాణిక్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివ పార్వతులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు గోత్రనామాలు చదివి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఛైర్మన్ పర్వేద మాణిక్‌రావు దంపతులు దగ్గరుండి కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీమ్‌భరత్, బీజేపీ జిల్లా కార్యదర్శి సారా జగన్, దళిత మోర్చా మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన సంగమేశ్వరాలయం

యాలాల: అమావాస్య సందర్భంగా యాలాల మండలంలోని సంగెంకుర్దు సంగమేశ్వరాలయంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వందలాది భక్తులు సంగమేశ్వర ఆలయాన్ని సందర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం అమవాస్య రోజు సంగమేశ్వర ఆలయంలో మండలంలోని భక్తులతో పాటు తాండూరు ప్రాంతంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో హాజరై దర్శనం చేసుకుంటారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీలత అనంతయ్య ముదిరాజ్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.


సంగమేశ్వర దేవాలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వేలంలో శివకలశానికి రికార్డు ధర

బషీరాబాద్: మండలంలోని జీవన్గిలోని శ్రీమహాదేవలింగేశ్వరాలయంలో శివరాత్రి జాతర ఉత్సవాల సందర్భంగా నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న శివ కలశాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు ఆదివారం వేలం వేశారు. 38ఏళ్లుగా కలశం వేలం సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ కలశం పొందిన వారికి అన్నీ శుభాలే జరుగుతాయని, పిల్లలు పుట్టని వారికి సంతానం కలుగుతుందని, గ్రహబలం వంటి తదితర లాభాలు చేకూరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈసారి హైదరాబాద్ ప్రాంతం మేడ్చల్‌కు చెందిన భీంరెడ్డి వేలంలో పాల్గొని రూ.85,116కు కలశాన్ని దక్కించుకున్నారు. అనంతరం శివకలశాన్ని డప్పులు, వాయిద్యాల మధ్య కమిటీ నిర్వాహకులు ఆయన ఇంటికి పంపించారు.


శివకలశంతో ఊరేగింపుగా వెళ్తున్న భీంరెడ్డి కుటుంబసభ్యులు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి సావిత్రిబాయి పూలే


బొంరాస్‌పేట్‌లో సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీవీవీ నాయకులు

బొంరాస్‌పేట్, మార్చి 10: అణగారిన మహిళా వర్గాల ఆశాజ్యోతి సావిత్రిబాయిపూలే అని విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతిని సందర్భంగా ఆదివారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ కుటుంబంలో జన్మించిన సావిత్రిబాయిపూలే అణగారిన మహిళావర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీవీవీ నాయకులు, ఉపాధ్యాయులు బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్, అనిల్‌కుమార్, బాకారం శోభారాణి, సీఆర్పీ నర్సింహులు, ఐఆర్‌పీ వేణుగోపాల్, ఖలీల్, ఎండీ.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: అణగారిన వర్గాలకు అక్షరజ్ఞానం నేర్పిన చదువులతల్లి సావిత్రిబాయిపూలే అని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్ అన్నారు. సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పరిగిలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రాథోడ్ శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, శంకర్, అంబర్‌సింగ్ పాల్గొన్నారు.


పరిగిలో సావిత్రిబాయిపూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యాభివృద్ధితోనే మహిళల్లో చైతన్యం


శామీర్‌పేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మహిళలు, నాయకులు

శామీర్‌పేట, మార్చి 10: విద్యాభివృద్ధితోనే మహిళల్లో చైతన్యం కలుగుతుందని బీఆర్ఎస్ మండల నాయకులు తుంకి రమేశ్ అన్నారు. మజీద్‌పూర్‌లో తుంకి రమేశ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా తుంకి రమేశ్ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి మహిళా దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. గ్రామంలోని మహిళలను, డ్వాక్రా మహిళలను, ఆయన ఘనంగా సన్మానించి మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సురేష్, డ్వాక్రా గ్రూప్ సభ్యులు, మండల కాంగ్రెస్ కమిటీ బీసీ సెల్ అధ్యక్షుడు అబ్బగౌని బాస్కర్‌గౌడ్, కొల్తూర్ దుర్గం వెంకటేశ్, కుడుముల వెంకటేశ్, వీరయ్యగౌడ్, అబ్బగౌని వినోద్‌గౌడ్ పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో..

మేడ్చల్ టౌన్: మున్నూరు కాపు సంఘం, విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గుండ్లపోచంపల్లి పరిధి కండ్లకోయలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మున్నూరు కాపు మహిళలను సంఘం వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.


మహిళలను సన్మానిస్తున్న సంఘం నేతలు

భక్తులకు పండ్లు, వాటర్‌బాటిళ్ల పంపిణీ


పండ్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న మల్క యశస్వి

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కీసరగుట్ట జాతరకు విచ్చేసిన భక్తులకు పల్లవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వేల పండ్ల కిట్స్, లక్ష వాటర్ బాటిళ్లు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ నిర్వాహకులు, ఢిల్లీ పబ్లిక్ సీఈవో మల్క యశస్వి తెలిపారు. కీసరగుట్టలో ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్, పల్లవి స్కూల్స్ సహకారంతో జాతరకు వచ్చే భక్తులకు సేవా చేయాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు. తన తండ్రి మల్క కొమరయ్య స్ఫూర్తితో పల్లవి ఫౌండేషన్ తరఫున నిరంతరం సేవాకార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో అసెంబ్లీ స్పీకర్


వేడుకల్లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, మార్చి 10: ప్రముఖ వ్యాపారస్థుడు, రాష్ట్ర ఆరెకటిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌలికార్ నర్సింగ్‌రావు, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ జయ 50వ (గోల్డెన్‌జూబ్లీ)వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. నర్సింగ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఈ వేడుకలను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ వి.సత్యనారాయణ, శివారెడ్డిపేట సొసైటీ మాజీ ఛైర్మన్ కిషన్‌నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి రత్నారెడ్డి, వెంకట్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, వ్యాపారులు హాజరై జయ, నర్సింగ్‌రావులకు శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ లీగల్ సెల్ కన్వీనర్‌గా రమేశ్ ఎన్నిక


రమేశ్

మోమిన్‌పేట్, మార్చి 10: సామాన్య కార్యకర్త నుంచి బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ లీగల్ సెల్ కన్వీనర్‌గా రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో బీజేపీ అధిష్టానానికి రాష్ట్ర బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్ రామారావుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సామాన్య కార్యకర్త నుంచి చేవెళ్ల పార్లమెంట్ లీగల్ సెల్ కన్వీనర్‌గా ఎంపిక చేయడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానన్నారు.

ఈ నెల 14న ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్, మార్చి 10: ఈ నెల 14న లయన్స్‌క్లబ్ ఆఫ్ కొడంగల్, జిల్లా కలెక్టర్, ఛైర్మన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, కందూరి రాంరెడ్డి కంటి ఆసుపత్రి మహబూబ్‌నగర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 14న కొడంగల్ ప్రభుత్వాసుపత్రిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి

కులకచర్ల, మార్చి 10: కాంగ్రెస్ పార్టీతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నాయకులు, అఖిల భారత బంజార సేవా సంఘం పరిగి తాలూకా అధ్యక్షుడు నేనావత్ రాహుల్‌నాయక్ తెలిపారు. మండలంలోని హీర్యానాయక్ తండాలో ఆదివారం ఉపాధిహామీ నిధులతో వేసిన సీసీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే గ్రామాలు, గిరిజన తండాలకు ఉపాధి నిధులు మంజూరు చేసి సీసీరోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హీర్యానాయక్, రాములునాయక్, రాంచందర్‌నాయక్, గోట్యానాయక్, రమేశ్, కిషన్, దేవిలిబాయి తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్: మండలంలోని జమ్లానాయక్ తండాలో రూ.2.50లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను కాంగ్రెస్ సీనియర్ నాయకులు జయరాంనాయక్ ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఉపాధిహామీ పథకం కింద నిధులు మంజూరు చేయించడంతో పనులను మొదలుపెట్టారు. ఈ కార్యక్రమంలో గిరిజనుల ఐక్యవేదిక వికారాబాద్ జిల్లా కో-ఆర్డినేటర్ శంకర్‌నాయక్, శంకర్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దేముల్: మండలంలోని ఆత్కూర్ గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి జాతీయ ఉపాధిహామీ పథకం నుంచి ఆత్కూర్ గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేశారు. దీంతో ఆత్కూరులో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, మురుగుకాలువల వంటి అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు కావడం చాలా సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.


బషీరాబాద్: జమ్లానాయక్‌తండాలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


దోమ: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

దోమ, మార్చి 10: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన 2002-03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఒకేచోట చేరారు. స్థానిక ఎస్‌జీ గార్డెన్ ఇందుకు వేదికైంది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, రవీందర్‌గౌడ్, మల్లయ్య, సుభాష్, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌లను సన్మానించారు. పూర్వ విద్యార్థులంతా 20ఏళ్ల నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఆటపాటలతో సందడిగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఖాజపాష, చంద్రబోస్, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, రమేశ్, భీమయ్య రఫీక్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

కొర్రెములలో..

ఘట్‌కేసర్ రూరల్: కొర్రెముల జిల్లా పరిషత్ పాఠశాల 2010-2011 బ్యాచ్ విద్యార్థుల పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. నాటి విద్యార్థులు, గురువులను శాలువాలతో సత్కరించి, పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ్‌కుమార్, పాండురంగం, నర్సింహులు, శివకుమార్, తిరుమల్‌రెడ్డి, ఆదినారాయణ, నాయక్, మల్లేష్, రాజేశ్వర్‌రెడ్డి, సుశీల, 2010-2011 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.


ఘట్‌కేసర్ రూరల్: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నక్క వరలక్ష్మి

ఘట్‌కేసర్, మార్చి 10: డాక్టర్. బీఆర్ అంబేడ్కర్‌ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని చౌదరిగూడ మాజీ సర్పంచ్ నక్క వరలక్ష్మి అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ప్రబుద్ధ భారత్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎదులాబాద్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్ కుమార్, దాసు, నర్సింగరావు, రాందాస్, నారాయణ, అశోక్, రాజేష్, సత్యం పాల్గొన్నారు.

ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి


నాగారం మసీదులో ముస్లింలను కలిసిన అన్సారీ

ధారూరు, మార్చి 10: నాగారంలోని ముస్లింలతో కాంగ్రెస్‌పార్టీ జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడు అయూబ్ అన్సారీ ఆదివారం సమావేశమయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మసీదు, ముస్లింల సమస్యలపై ఇచ్చిన హామీలను నేరవేరుస్తామని తెలిపారు. సమస్యలను తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసికెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లాల్‌మహ్మద్, గౌసొద్దీన్, దస్తగిరి, హేమత్, ఖుద్రత్‌అలీ, షాబుద్దీన్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **మేడ్చల్ టౌన్:** పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తల్లో కొత్త జోష్ నింపటానికి మేడ్చల్ మండలంలో బైక్ ర్యాలీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా బీజేపీ కిసాన్ మర్చ ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్ తెలిపారు. సోమవారం మేడ్చల్ రైల్వే స్టేషన్ నుంచి తమ ర్యాలీ ప్రారంభించి మండలంలోని అన్ని గ్రామాలను పర్యటిస్తుందన్నారు. ఈ ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని జయ ప్రదం చేయాలని కోరారు.

● **పెద్దేముల్:** మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సోదరుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన సందర్భంగా పెద్దేముల్ మండల కాంగ్రెస్ నాయకులు పెద్దేముల్ ప్రధాన చౌరస్తాలో కేక్‌కట్‌చేసి వేడుక నిర్వహించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి, నాయకులు మహిపాల్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షులు నారాయణరెడ్డి, ఉప్పరి మల్లేశం, జితేందర్ రెడ్డి, మైనార్టీసెల్ కన్వీనర్ రియాజ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లారెడ్డి, డీవై.నర్సింహులు, మాజీ ఎంపీటీసీ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

● **తాండూరు:** స్వర్గీయ కల్వ అనురాధ జయంతి సందర్భంగా ఈనెల 13న ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి, బాలాజీ ఆస్పత్రి తాండూరు ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు బాలాజీ ఆస్పత్రి ఎండీ డాక్టర్ సంపత్ కుమార్, కల్వ సుధాకర్ తెలిపారు. బాలాజీ ఆస్పత్రిలో ఉదయం 10.30గంటలకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు.

క్రైం కార్నర్

పేలుడు పదార్థాలను అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు


పేలుడు పదార్థాలతో పాటు పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితుడు సురేష్

కీసర రూరల్, మార్చి 10: పేలుడు పదార్థాలను అక్రమంగా నిల్వ ఉంచిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో నివాసముంటున్న పల్లపు సురేష్ నిబంధనలకు విరుద్ధంగా పేలుడు పదార్థాలు నిల్వ ఉంచాడు. సమాచారం అందుకున్న కీసర పోలీసులు, మల్కాజ్‌గిరి ఎస్‌వోటీ పోలీసులు సంయుక్తంగా అతడి ఇంట్లో సోదాలు నిర్వహించగా పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలను గుర్తించారు. ఈ మేరకు నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. డిటోనేటర్లు 15, జిలెటిన్ స్టిక్స్ 32, పొటాషియం రెండు కేజీలు, అమోనియం నైట్రేట్ 50కేజీలు, బ్లాస్టింగ్ వైర్ 7బండిల్స్, ఖాళీ డిటోనేటర్స్ 260, బ్లాస్టింటగ్ సాల్ట్ 15 కేజీలు మొత్తం సుమారు రూ.లక్ష విలువైన పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకరంగా గుంత

● ఇబ్బందుల్లో వాహనదారులు


గుంతలో ఇరుక్కుపోయిన ఆటో

దోమ, మార్చి 10: మండల కేంద్రంలోని 7వ వార్డులో రోడ్డు మధ్యలో తాగునీటి సరఫరాలో ఆన్‌ఆఫ్ చేసేందుకు తీసిన గుంతపై కప్పు లేక పోవడంతో బాటసారులకు, వాహనదారులకు ప్రమాదాలకు నిలయంగా మారింది. తాగునీటిని సరఫరా చేసే ఆటో ఆదివారం ఆ గుంతలో ఇరుక్కుపోయింది. అయితే ఎవరికీ ఎలాంటి హానీ కలగలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతపై కప్పు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి


మాట్లాడుతున్న జనతా జ్యూవెలర్స్ అధినేత తస్వర్ అలీ

వికారాబాద్, మార్చి 10: స్వయం ఉపాధితో ఆర్థికంగా బలోపేతం కావాలని ప్రముఖ వ్యాపారవేత్త, జనతా జ్యూవెలర్స్ అధినేత తస్వర్ అలీ అన్నారు. అలఫై సొసైటీ, అల్‌ఖైర్ సొసైటీ, జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందిన 42 మంది మహిళలకు ఆదివారం స్థానిక ఇస్లామిక్ సెంటర్‌లో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్ ఖైర్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ రఫూఫ్, జమాతే ఇస్లామీ హింద్ అధ్యక్షుడు ఎండీ ఫయాజ్, ఎస్ఐవో అధ్యక్షుడు ఆఫ్నాన్, జాకీర్ పాల్గొన్నారు.

తిరుపతిరెడ్డి కోలుకోవాలని ఆలయంలో పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొడంగల్, మార్చి 10: హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి త్వరగా కోలుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అదేవిధంగా కొడంగల్ మండలం లోని చిట్లపల్లి అబ్దుల్ షాసాహెబ్ దర్గాలో, కొడంగల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దాము, రమేశ్, దస్తప్ప, సాయి, అశోక్, బాబు, వెంకటేశం, కృష్ణంరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు


సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీతో ఆసిఫ్‌ఖాన్

కొడంగల్, మార్చి 10: తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు నూతన ఛైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, హజ్ కమిటీ డైరెక్టర్ ముజీబుద్దీన్‌ను కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ కొడంగల్ మండల అధ్యక్షుడు ఆసిఫ్‌ఖాన్ కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

అఖండ జ్యోతికి ఘన స్వాగతం


ఘట్‌కేసర్ రూరల్: అవుషాపూర్‌లో అఖండజ్యోతి రథయాత్రకు స్వాగతం పలుకుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్, మార్చి 10: యాదాద్రి లక్ష్మీ నర్సింహస్వామి అఖండ జ్యోతికి ఘట్‌కేసర్‌లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు ఆదివారం ఘనస్వాగతం పలికారు. బర్కత్‌పురలోని యాదాద్రి భవన్ నుంచి బయలు దేరిన అఖండ జ్యోతి యాత్ర(దివ్య పుష్ప రథం) శనివారం రాత్రి ఘట్‌కేసర్‌కు చేరుకున్నది. ఘట్‌కేసర్‌లోనే బసచేసి ఆదివారం ఉదయం తిరిగియాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ముల్లిపావని జంగయ్యయాదవ్‌తో పాటు పలువురు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముత్యాలు యాదవ్, జనసమితి మారం లక్ష్మారెడ్డి, కౌన్సిలర్ మల్లేష్, మాజీ సర్పంచ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: హైదరాబాద్, బర్కత్‌పుర నుంచి యాదగిరిగుట్టకు బయల్దేరిన అఖండజ్యోతి రథయాత్ర ఆదివారం ఉదయం మండలంలోని అవుషాపూర్‌కు చేరుకుంది. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డిలతో పాటు స్థానికులు రథయాత్రకు ఘనస్వాగతం పలికారు. లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కొబ్బరికాయలు, పూలు, పండ్లు స్వామివారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఏనుగు మశ్చేందర్‌రెడ్డి, జిల్లాల రాజశేఖర్‌రెడ్డి, భిక్షపతి గుప్త, బానుప్రకాష్‌యాదవ్, ప్రవీణ్, సుకేష్ గుప్త, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.